
# ఒక్క వానకోసం

పాపినేని శివశంకర్



కథ

**ఒక్క వానకోసం ఎదురుచూస్తున్నా. నాలాగా ఇంకెంతమందో ఎదురుచూస్తుండొచ్చు. చిన్నప్పుడు పిల్లలంతా పాడుకునేవాళ్లం, 'వానా వానా వల్లప్పా! చేతులు జాపు చెల్లప్పా!' అంటూ. 'వానల్లు కురవాలి వానదేవుడా! వరిచేలు పండాలి వానదేవుడా!' అనే పాట తెలుగు పాఠాల్లో ఉండేది. అప్పుడు ఎదురుచూసిన వాన వేరు. ఇప్పుడెదురు చూస్తున్న వానవేరు. ఒక్కవాన కోసం.**

**తాత కూడా ఎదురుచూసేవాడు, కళ్లకి చెయ్యడ్డం పెట్టుకొని, దూరంగా కొండలమీదుగా, 'ఒరే బుల్లోడా! కాత్తె సూడ్రా. కొండలమీన మొగులు మేస్తందా?'**

"ఏమీ మెయ్యటం లేదు"

"అది కాదురా. మబ్బులు కనబడతయ్యోమోనని. ఎప్పుడుపడిద్దో యేమో వాన".

"ఎందుకు తాతా తేప తేపకీ వానంటావు?"

"వాన లేకపోతే పంటల్లేవురా. బూమి లేదు. మనంలేము. అటు చూడు పత్తిసేను ఎట్టాబెట్ట గొట్టిందో" అని నెర్రెలు పడ్డ పొలం చూపించాడు. తాత దృష్టిలో వాన లేకపోతే మనిషేలేడు.

అయితే డాడీ చెప్పిన వానవేరు. వానంటే వానకాదు. వరాలవాన. మనిషి వానకోసం నిరీక్షిస్తే లాభం లేదనీ, వానను వెదుక్కుంటూ వెళ్లాలనీ డాడీ చెప్పాడు (మమ్మీకివేం తెలీవు) అందుకే పల్లెటూరు కర్లపూడి వదిలి గుంటూరు చేరాం. వానకోసం తప్ప ఇంక దేనికోసమూ ఎదురుచూడనక్కర్లేదని, వానలో తడవని బతుకు బతుకుకాదని చెప్పాడు. తన జీవితంలో చిరుజల్లులు తప్ప గాలివానలు చూళ్లేకపోవటంవల్ల నా భవిష్యత్తుమీద ఆశ పెట్టుకున్నాడు.

డాడీ పెంపకంలో పదో తరగతినుంచే నాలో తపన పెరిగిపోయింది. పరిగెత్తాలి. రన్ అండ్ రన్. అందరికన్న అన్నిట్లో ముందునిలవాలి, చదువుతప్ప ఇంకేం పట్టించుకోగూడదు. ఆటపాటలు, స్నేహితులు, ఆహ్లాదాలు అన్నిటినీ వదులుకోవాలి. అప్పుడే అందరికంటే ముందు పరిగెత్తి నల్ల మబ్బులకింద నిలబడగలం. ముద్దముద్దగా తడవగలం.

అయితే నాలో తండ్రి రక్తంకన్న తాతరక్తం ప్రాథమికంగా ప్రవహిస్తుందేమో, (ఇద్దరి రక్తం గ్రూపు 'ఓ' పాజిటివే). తాతకి పరుగుపందాలమీద ఆసక్తి లేదు. నిదానమే ఎప్పుడూ. మబ్బు మన దగ్గరికొచ్చి, కరిగి కురవాలేగాని, మనం మబ్బుదగ్గిరకెళ్లలేమని తన సిద్ధాంతం. అయితే డాడీ బలవంతంతో నేనూ ఇంజనీరింగ్ పరుగు ప్రారంభించాను. నాతోపాటే పరిగెత్తుతున్న రూమ్మేట్ ఉన్నట్టుండి బోర్లాపడ్డాడు. దడుచుకున్నాడు. ఒక రాత్రిపూట తన పరుగు ఆపి సీలింగ్‌ఫ్యాన్‌కి వేలాడబడ్డాడు. పరిగెత్తటంకన్న వేలాడటమే నయమని అతనిచ్చిన సంకేతానికి చలించిపొయ్యాను. భయంతో జలదరించిన నా వెన్నుతట్టాడు నాన్న. ఫ్యాన్‌వంక ఎప్పుడూ అదేపనిగా చూడొద్దన్నాడు. వీరుడన్నవాడు పరిగెత్తి తీరాలన్నాడు.

సెలవుల్లో కర్లపూడి వెళ్లినప్పుడూ కూడా నేను సరదాగా అటు ఇటు తిరక్కుండా పుస్తకాలకే అంటుకుపోవటం చూసి తాతయ్య అడిగాడు, 'అటెళ్లి చిన్నప్పటి సావాసగాళ్లతో తిరిగి రావచ్చుగదరా?' అని. అమరావతి కూడా వెళ్లి రమ్మన్నాడు.

"చదువు తప్ప మరోలోకం పనికిరాదు. పోటీలో వెనకబడరాదు" అని సీరియస్‌గా చెప్పాను.

"పోటీ ఏందిరా నీ మొకం? ఈ నేలమీద ఎవుడికుండే చోటు వాడికుంటది. ఎవుడికెవుడూ పోటీగాదు. ఎక్కువ తక్కువలు పెపంచంలో మామూలే" అన్నాడు తాత చక్రంమీదగా ఎడ్లబండి మీదకెక్కుతూ. నన్ను కూడా తొట్లో కూర్చోబెట్టుకున్నాడు. ఊళ్లో జరుగుతున్న ఎడ్లపందాల గురించి చెప్పాడు.

"బండలాగుడు పోటీకి మన కోడెగిత్తల్ని వదలమని అడిగారు. నీకు దెలుసుగా, మన గిత్తల్ని మించినవి యీ సుట్టుపక్కల లేవు. అయినాగాని వచ్చినాళ్లని సెడామడా మొకంమీదనే తిట్టా. మడుసులు సెయ్యలేని పని అయ్యి సేత్తన్నాయి. ఆటి మద్దె పోటీ యేంది? దేని గొప్ప దాందే గందా? నా గిత్తల్ని పోటీకి వదలనని తెగేసి జెప్పా".

కానీ నేను గిత్తను కాను, బి.టెక్.చదువుతున్న మనిషినని తోచింది. చదువు పూర్తయిందాకా పోటీలో వెనుదిరిగి చూళ్లేదు. కానీ ఏదీ వాన? వాతావరణం వేరుగా ఉంది. బెంగుళూరులో పెద్దగా పేరులేని పెద్ద జీతంలేని ఉద్యోగం. స్టేట్స్ వెళ్లి ఎం.ఎస్.చెయ్యమన్నాడు డాడీ. మళ్లీ పోటీ. జి.ఆర్.ఇ., టోఫెల్. స్కోర్ చాలలేదు. మళ్లీ ప్రయత్నించాలి. ఆ తర్వాతే ఏదైనా, హరితతో ప్రేమైనా.

"దేనికోసం పదే పదే బయటికి చూస్తున్నావ్ హరీ!" అడుగుతుంది హరిత. రెస్టరెంట్‌లో చిరుచీకట్లో ఎదురెదురుగా ఇద్దరం. సన్నగా వెస్ట్రన్ బీట్.

*వీసా కోసం అప్లై చేసినట్టు చెప్పాను హరితతో. మంచివర్క్ హిస్టరీ ఉన్న కన్సల్టెన్సీ ద్వారా ప్రయత్నం. లక్షపైగా ఖర్చు అయింది. "వెరీగుడ్. దీనికోసమే గదా ఎదురుచూస్తుంది. ఎంత తొందరగా వస్తే అంత తొందరగా నిన్ను పెళ్లాడి నీతోపాటు వచ్చేస్తా. డర్టీ ఇండియా" అంది హరిత హుషారుగా.*

"వానకోసం"

"వానకోసమా? ఆర్ యు మాడ్?"

"నో, ఇట్స్ డిఫరెంట్ రెయిన్"

ఒకళ్లిద్దరు స్టేట్స్ వెళ్లొచ్చిన ఫ్రెండ్స్‌ని అడిగాడు, న్యూయార్క్‌లో W.T.C. మీదా, ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ మీదా, లిబర్టీ విగ్రహం మీదా వానపడేటప్పుడు ఎట్లా వుంటుందని.

"ఎక్సలెంట్! జస్ట్ యు కాన్ట్ ఇమేజిన్"

W.T.C. కూలిన తర్వాత అక్కడి వాతావరణం మారిపోయి వుంటుంది. 'దిసీజ్ అన్ బేరబుల్' అన్నాడు ప్రవీణ్ ఇ-మెయిల్‌లో. హ్యూస్టన్‌లో ఎమ్మెస్ చేశాడు. ఇంకా ఉద్యోగం రాలేదు. ప్రస్తుతం న్యూయార్క్‌లో తెలిసినవాళ్ల ఇంట్లో ఉంటూ, ఐదు, పది డాలర్లకోసం సబ్-వేలో పనిచేస్తూ.

వీసా కోసం అప్లై చేసినట్టు చెప్పాను హరితతో. మంచివర్క్ హిస్టరీ ఉన్న కన్సల్టెన్సీ ద్వారా ప్రయత్నం. లక్షపైగా ఖర్చు అయింది. "వెరీగుడ్. దీనికోసమే గదా ఎదురుచూస్తుంది. ఎంత తొందరగా వస్తే అంత తొందరగా నిన్ను పెళ్లాడి నీతోపాటు వచ్చేస్తా. డర్టీ ఇండియా" అంది హరిత హుషారుగా.

"ఇన్‌కేస్, వీసా రాకపోతే నన్ను పెళ్లి చేసుకోవా?" అడిగాను కవ్వింపుగా. "యూ నాటీ" అంది తేలిగ్గా (బహుశా తెలివిగానా?) "రాధిక ఇండియాలోనే బాగుంటుందంటుంది గానీ నాకిష్టంలేదు" అంది మళ్లీ. "నీకు తెలుసుగా, దాని పెళ్లి సెటిలైంది".

ఆ రాత్రి ఫ్రెండ్స్‌తో పార్టీలో కూర్చున్నాను. నాలాగే సాఫ్ట్‌డ్రింక్స్ తీసుకుంటూ 'ఆడ్‌మాన్' లాగా ఉన్న ఒక వ్యక్తి స్నేహితుడి బలవంతంమీద వచ్చాడనుకుంటా- మాటలమధ్య-

"అంతా అమెరికా వెళ్లిపోతే ఈ దేశం ఏంగాను?" అడిగాడు అమాయకంగా.

"దేశం సంగతి సోనియాకి, సరిహద్దుల సంగతి సైనికులకి వదిలేద్దాం" అన్నాడు శ్రీనివాస్. రాధిక పెళ్లి చేసుకునేదితణ్ణే.

"అయితే మరి దేశభక్తితో ఆలోచించనక్కర్లేదా?"

"హుఁ దేశభక్తి పెద్ద ఉటోపియా. మిత్‌రాదర్. యుద్ధమే వస్తే తమ ఉద్యోగం సద్యోగం వదులుకొని ఈ దేశంలో ప్రాణత్యాగానికి సిద్ధపడేదెవరు? అంతా మాటలవరకే. అయినా ఈ దేశం మనకేమిచ్చింది? పొలిటికల్ కరప్షన్. సోషల్ కరప్షన్. సో, మన సంగతి మనం చూసుకుంటే చాలు" అన్నాడో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

"పాతికేళ్లపాటు నీకు సమస్తం ఇచ్చింది ఈ దేశమేగదా?"

"కావచ్చు. కానీ ఈ దేశంలో ఇప్పుడు వానాకాలంలేదు" అన్నాను నేను కల్పించుకుంటూ. ఇది అచ్చం డాడీ మాటలే.

అమెరికన్ కాన్సులేట్ జనరల్ దగ్గర జనమే జనం. క్యూలో ఎక్కడో తను. (అమెరికన్ భాషలో లైన్ అనాలి). 'ఇదేముంది? 'రిసెషన్' రాకముందు బయట మైలు పొడుగు పెద్దపెద్ద క్యూలుండేది' అన్నాడొక అపరిచితుడు ఎవరితోనో. సెక్యూరిటీ



చెకింగ్ తర్వాత లోపలికి అడుగుపెట్టాను.

ఒకటే టెన్షన్. H-1B అంత తేలిగ్గా వస్తుందా? ఈ పేపర్స్ సరిపోతాయా? నన్ను స్పాన్సర్ చేసే కన్సల్టెన్సీకి గుడ్‌విల్ ఉందా? వాన కురుస్తుందా? అందరి మొహంలోనూ అదే ఆందోళన. ఇంతలో అందరూ ఒక్కసారిగా గుంపుగా మారి గుండ్రంగా తిరుగుతూ వానపాట అందుకున్నారు. నేనూ అందులో చేరిపోయాను.

"డాలర్లు కురవాలి వానదేవుడా!
దండిగా కురవాలి వానదేవుడా!
మా బతుకులన్నీ పండాలి వానదేవుడా!

నేను పూర్తిగా పాటలో లీనమయ్యాను. ఇంతలో పెద్దపెద్ద ఉరుముల్తో నలనల్లటి మబ్బులు. వానమొదలైంది. పల్చపల్చగా (నోట్లు, నాణేలతో) ఒకటే అందమైన వాన. నా ఆనందానికి అంతులేదు.

పాట పూర్తి అయిందో లేదో ఇంటర్వ్యూ కౌంటర్ ముందున్నాను. గ్లాస్‌డోర్‌కి అవతల అతను. ఇవతల నేను, ఈదురుగాలిలో.

"బాగా తడిసిపోయారు. మీకు వానంటే అంత ఇష్టమా?"

"అవును. ఎప్పట్నుంచో లిబర్టీ విగ్రహంమీద వానపడేటప్పుడు చూడాలని".

"చూస్తూ అక్కడే వుండిపోతారా?"

జవాబు చెప్పటానికి తడబడ్డాను. రెండో నిమిషంలో నా పేపర్లు తిరిగిస్తూ 'రిజెక్టెడ్' అన్నాడు. కారణం రాసివుంది. 'ఇతను లిబర్టీ విగ్రహంమీద పడే వానచూస్తూ అక్కడే శాశ్వతంగా ఉండిపోగలడు' అని.

అంతులేని ఆశాభంగం. లోపల, బయట వానమబ్బులు అదృశ్యమయ్యాయి. ఒకటే ఉక్క. ఎవరివంకా చూడలేని చిన్నతనం. మళ్లీ ఏడాది ఆగాలి. వానాకాలంకోసం.

"హరిత కన్పించిందా ఈమధ్య?" అడిగాడు శ్రీనివాస్ కాంటీన్లో కాఫీ తాగేటప్పుడు ఆసక్తిగా.

"లేదు. ఏంటి సంగతి?" నా కనుబొమలు ముడిపడ్డాయి.

"నీకింకా తెలీలేదా? తన పెళ్లి కుదిరిందంట. అతనికి కాలిఫోర్నియాలో మైక్రోసాఫ్ట్‌లో జాబ్. రాధికతో చెప్పిందంట".

గుండెలమీద ఎవరో గట్టిగా తన్నినట్టు చిక్కబట్టింది. ఏమీ మాట్లాడలేక కాసేపు...

"సారీ" అన్నాడు శ్రీనివాస్, నా మౌనం వెనక బాధని గుర్తించి. "ఇట్స్ ఓకే. తన పెళ్లి తన యిష్టం" అన్నాను, నిరాసక్తంగా కనపడాలని ప్రయత్నిస్తూ.

"అదేంటి? మరిన్నాళ్లు మీరిద్దరు కలిసి తిరిగిందానికి అర్థమేమిటి?

"ఎవిరిథింగ్ ఈజ్ మీనింగ్‌లెస్. పర్‌హాప్స్ అవర్ లవ్ ఆల్సో".

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఎన్ని సాయంత్రాలు హరితతో- ఆహ్లాదంగా...? భవిష్యత్తు గురించి ఎన్ని కలలు? నేను ముందే అమెరికా వెళ్లిపోతే ఆ గ్యాప్ ఎట్లా భరించాలని చాలాసార్లు వాపోయింది.

ఇప్పుడు నాకంటే ముందే వెళ్లిపోతుంది. బహుశా నాకింక వీసారాదని నిర్ణయించుకోనుంటుంది. నా మానసిక క్షోభలోంచి చుట్టూ చూశాను.

శ్రీనివాస్, రాధిక 'ప్రేమ' సంగతి నాకు తెలుసు. చాలాకాలం కలిసిమెలిసి తిరిగారు. పెళ్లికోసం రాధిక తొందరపడలేదు. శ్రీనివాస్ కూడా బలవంతపెట్టలేదు. టీవీ యాంకర్‌గా తన ప్రొఫెషన్‌కి పెళ్లి అడ్డం అవుతుందనుకుందేమో, ఈ మధ్యనే ఎందుకో హఠాత్తుగా రిజిష్టర్ మేరేజి చేసుకున్నారు.

అప్పుడప్పుడు శ్రీనివాస్ గాక వేరే మగాళ్లతో కన్పిస్తుంది రాధిక. మొదట్లో వాళ్ల ప్రొఫెషన్‌కి సంబంధించినవాళ్లేమోననుకున్నాడు తను. రానురాను వేరే అనుమానాలు కలుగుతున్నాయి. శ్రీనివాస్‌తో అనలేదు. అతనికే తెలిసేవుండాలి.

ఒకసారి ఫ్రెండ్స్ మధ్య డిస్కషన్ వచ్చింది. సిటీలో సెక్స్ వర్కర్స్ గురించి. ఒకతను పనిగట్టుకొని టీవీయాంకర్స్ వ్యవహారాలు ప్రస్తావించాడు. తన అనుమానాలు బలపడ్డాయి.

ఒకరోజు ఫ్రెండ్‌తో కలిసి హోటల్ రీగల్‌కి వెళ్లాడు. రిసెప్షన్ కౌంటర్ దగ్గర ఎవరితోనో కన్పించింది రాధిక. తనను చూసి 'హలో' అంది. ఏమాత్రం బిడియపడలేదు. ఇద్దరూ చేతులు పట్టుకొని లిఫ్ట్‌లోకి వెళ్లటం చూశాడు తను.

రాధిక ప్రవర్తన తనకెప్పుడూ అసభ్యంగా తోచలేదు. మరెందుకిట్లా జరుగుతోంది? ఆమె విలాసవంతమైన జీవితానికి కారణమేంటి? చైతన్యనగర్‌లో అపార్ట్‌మెంట్‌లో ఒక్కతే వుంటుంది. అమ్మ, నాన్న ఇంకెక్కడో. భయంలేదు, దేనిగురించీ బాధలేదు.

ఈసారి కన్పించినప్పుడు తప్పకుండా అడగాలి, వానంటే నీకిష్టమా? 'అబ్బో! రోజూ ఒకటే వాన' అంటుందేమో. ఏదైనా అటు గ్లామర్, ఇటు లగ్జరీ- రెండూ ఎంజాయ్ చేస్తుంది.

(ఫ్రెండ్స్‌లో కమల్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పెట్టాడు. ఇంకొకడు ఇంటర్నెట్ నడుపుతున్నాడు. కమల్‌కి ఫ్రెండ్ సర్కిల్ ఎక్కువే. బిజినెస్‌కి ఢోకాలేదు. ఇంకొకడికి పెద్ద యాంబిషన్స్ లేవు. నెట్‌సెంటర్‌కి వచ్చే అమ్మాయిలతో, అడల్ట్ వెబ్‌సైట్స్‌తో బాగానే కాలక్షేపం అవుతుంది.)

ఇవి ప్రేమలేనా? వీటన్నిటిమధ్య నా ప్రేమ సంగతేమిటి? నేను, హరిత నిజంగా ప్రేమించుకున్నామా? మాది ప్రేమలేఖలతో గాక కరెన్సీ కాగితాలతో ముడిపడిన మోహమా?

నా చుట్టూ ఎవరూ ఎవరి ప్రేమనీ "ప్రేమగా" గుర్తించటంలేదని తెలుస్తోంది. అవసరం, ఉపయోగం- ఈ రెండు మాటలు ఈ తరం నిఘంటువులో విలువైన మాటలని డాడీ చెప్పాడు. కానీ హరిత చేతిస్పర్శ వదలటంలేదు. నాలో ఎక్కడో తాతరక్తం కదలబారుతుందా? మనుషుల్ని ఎంత గాఢంగా దగ్గరికి తీసుకుంటాడు తాత? స్పర్శ, ప్రేమ తన జన్యుకణాలని తాతచెప్ప(లే)కపోయినా నాకర్థమవుతుందిప్పుడు. తన పెళ్లి అయిన కొద్దికాలానికే నాయనమ్మ జబ్బు పడింది. ఇంట్లో అందరూ ఆమెని వదిలేసి వేరే పెళ్లి చేసుకొమ్మన్నా తాత వినలేదు. ఆఫీసులో పని ఒత్తిడిలో ఉండగా కర్లపూడి నుండి ఫోనొచ్చింది. ఫోన్‌లో డాడీ.

"హరీ! తాతయ్య ఆరోగ్యం బాగోలేదు. డాక్టరు కూడా ఏమీ చెప్పలేం అంటున్నాడు. పెద్ద వయస్సుగదా! నిన్ను చూడాలని మరీ మరీ కలవరిస్తున్నాడు. నీ పనులన్నీ పక్కనపెట్టి వెంటనే బయల్దేరి రా".

ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. అసలే వీసా రిజెక్ట్ అయి లోస్పిరిట్స్‌లో ఉన్నాను. దానిమీద ఈ వార్త. నన్నింకా కర్లపూడితో కట్టిపడేసింది తాతయ్యే. ఆ పల్లెటూళ్లో ఎందుకని, ఏ ఆనందం కోరుకొని వుంటున్నాడో నాకంతగా అర్థంగాలేదు.

నాయనమ్మ పోయి చాలాకాలమైంది. అప్పటినుంచీ గుంటూరు వచ్చెయ్యమని డాడీ, నేను ఎన్నోసార్లు చెప్పాం. కానీ విన్పించుకోలేదు. 'ఆయన మనమాటెందుకు వింటాడు' అన్నాడు డాడీ. కర్లపూడి పొలం అమ్మి గుంటూర్లో ప్లాట్లు కొంటానంటే తాత ఒప్పుకోలేదు. "పొలం నలుగురికి అన్నంపెట్టుద్ది. స్థలాలు పెట్టవు" అన్నావు ఖండితంగా.

"నిన్ను నాతోపాటు అమెరికా తీసుకెళ్తాను వస్తావా తాతా!" ఒకరోజు అడిగాను.

తాతయ్య పగలబడినవ్వాడు. "ఎందుకురా అమెరికా?" అడిగాడు. "ఈ కొండలబారు, చేలు, గొడ్డూ గోద అక్కడుందయ్యా?"


"అక్కడ పెద్దజీతం, కార్లు, మేడలు. లైఫ్- అంటే మన జీవితం బ్రహ్మాండంగా వుంటుంది. నువ్వసలు ఊహించలేవు".

"అట్టాగా. అక్కడ జనం ఏంతింటార్రా?"

"అదేంటి తాతా!"

"లక్షాధికారైన లవణమన్నమెగాని మెరుగుబంగారమ్ము మింగలేడు" అన్నాడు తాతయ్య. ఆ మాటకి నా దగ్గర జవాబులేదు. 'ప్రాప్తం' అనేమాట తాతయ్య నోటివెంట చాలాసార్లు విన్నాను. తుఫాను దెబ్బకి పంటచేలన్నీ మునిగిపోయినప్పుడు ఊరు ఊరంతా దుఃఖంలో మునిగిపోయింది. తాతయ్య మాత్రం తేలిగ్గా నవ్వేశాడు. 'మనకి ప్రాప్తం లేదంతే' అన్నాడు.

ఆఫీసులో లీవ్ మెసేజ్ పెట్టి వెంటనే బయల్దేరాను. బెంగుళూరునుంచి గుంటూరు చేరేపాటికే సాయంత్రమైంది. అక్కడనుంచి 'అమరావతి' బస్సులో ప్రయాణం. పద్నాలుగో



"బాగా తడిసిపోయారు. మీకు వానంటే అంత ఇష్టమా?"

"అవును. ఎప్పట్నుంచో లిబర్టీ విగ్రహంమీద వానపడేటప్పుడు చూడాలని".

"చూస్తూ అక్కడే వుండిపోతారా?"

జవాబు చెప్పటానికి తడబడ్డాను. రెండో నిమిషంలో నా పేపర్లు తిరిగిస్తూ 'రిజెక్టెడ్' అన్నాడు. కారణం రాసివుంది. 'ఇతను లిబర్టీ విగ్రహంమీద పడే వానచూస్తూ అక్కడే శాశ్వతంగా ఉండిపోగలడు' అని.

**తాతయ్య కదిలాడు. మెల్లిగా పిలిచాను. కళ్లు తెరిచి చూసి గుర్తుపట్టాడు. నవ్వాడు. "వచ్చావంట్రా" అంటూ నా చెయ్యి తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఎన్నో దశాబ్దాల పనిపాటల్లో గరుకు బారిన చేతులు. నన్ను ప్రేమగా ఎత్తుకొని పెంచిన చేతులు.**



మైలురాయి దగ్గర దిగాను. సమయానికి ఆటోలు లేవు. కొండల పక్కగా ఇంకో మైలు కాలినడక. ఇంటిదగ్గర అమ్మ కన్పించింది. ఇంతకుముందు చూసినప్పటికి, ఇప్పటికి చాలా పాతబడిపోయింది పెంకుటిల్లు. నేనూహించినట్టు నట్టింట్లో కుక్కిమంచం, తాత కన్పించలేదు. భయమేసింది. అమ్మ గమనించింది.

"తాతయ్య కొష్టందగ్గర ఉన్నాడులే. అట్టట్టా ఉంది. కాళ్లు కడుక్కో. కాఫీదాగి వెళ్దువుగాని, అమ్మాయ్! రాణీ! తమ్ముడొచ్చాడే", అంది.

లోపల్నుంచి రాణి అక్కయ్య వచ్చి పలకరించింది. అక్క, బావ నిన్ననే వచ్చారని తెలిసింది. కాఫీ తేవటానికని అక్కయ్య వెళ్లబోతుంటే వద్దని, కొష్టం దగ్గరికి బయల్దేరాను.

దక్షిణం పక్క వీధిమలుపు తిరిగితే కొష్టం. కొష్టంముందు మెల్లాలో వేపచెట్టుకింద కుక్కిమంచం. పడుకొని మాగన్నుగా నిద్రపోతున్న తాత. చూసి చాన్నాళ్లైంది. బాగా తగ్గిపోయాడు. ఒళ్లంతా ముడతలు పడిపోయింది. మంచంపక్కనే మేకుకు కట్టేసిన పడ్డ దూడ మధ్యమధ్యలో తాత శరీరాన్ని నాకుతుంది.

మంచం పక్కనే డాడీ, బావ వున్నారు, డాడీ మొహంలో ఆందోళన స్పష్టంగా కన్పిస్తుంది.

"ఇప్పుడే డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చివెళ్లాడు. నమ్మకమైతే చెప్పలేదు".

"గుంటూరు తీసుకెళ్దాం డాడీ!"

"ఆ మాట నిన్ననే అనుకున్నాం. కానీ రానంటే రానని మొండికేశాడు. ఇక్కడే తనకు హాయిగా ఉంటుందంట. గాలి కాస్త మారి చల్లబడితే ఏం ఫర్వాలేదులే అంటాడు".

నిట్టూర్చాను. ఆయన పట్టుదల సడలించటం కష్టం. మంచం మీద కూర్చున్నాను. వేపచెట్టుకొమ్మల సందుల్లోంచి వెన్నెలనీడలు పడుతున్నాయి. అక్కడక్కడ పండి రాలినకాయలు. పడమటగా నల్లటికొండలు. అంతా ప్రశాంత నిశ్శబ్దం. ఎక్కడో ఊరకుక్క గయ్యిమంది. ఒక్కసారిగా ఏదో మరో లోకంలోకి వచ్చినట్టనిపించింది.

తాతయ్య కదిలాడు. మెల్లిగా పిలిచాను. కళ్లు తెరిచి చూసి గుర్తుపట్టాడు. నవ్వాడు. "వచ్చావంట్రా" అంటూ నా చెయ్యి తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఎన్నో దశాబ్దాల పనిపాటల్లో గరుకు బారిన చేతులు. నన్ను ప్రేమగా ఎత్తుకొని పెంచిన చేతులు.

"బుల్లాడా! నిన్ను జూట్టంకోసమే ఇంకా ఉండా" అన్నాడు మెల్లగా.

నాకు కళ్లమ్మట నీళ్లు తిరిగాయి.

తెల్లారింది. తాతయ్య పరిస్థితిలో మార్పులేదు. అయితే చనిపోతాననే దిగులు తనలో ఏమాత్రం కన్పించలేదు. గేదె మొన్ననే ఈనిందని చెప్పాడు. జున్నుబాలు తాగమన్నాడు. ఊళ్లో సంగతులు చెప్పాడు. పొలం సంగతులు చెప్పాడు. వానల్లేక పైర్లెండి పోతున్నాయన్నాడు.

"బుల్లాడా! గేదె అరుత్తుందిగానీ అల్లదుగో వామిదగ్గిర చొప్పకట్ట తెచ్చి, ఏసిరా, పో " అన్నాడు మాటల మధ్యలో. గేదెకి చొప్పకట్టేసి, పడ్డగూడకి నీళ్లుపెట్టాను. ఇవన్నీ చిన్నప్పుడు సరదాగా చేసినపనులే. అయితే అప్పటి ఎడ్లే లేవు. ఒకప్పటి వ్యవసాయానికి గుర్తుగా కాడి విరిగిన ఎడ్లబండిమాత్రం ఒక పక్కనుంది. ఆ ఎల్లెద్దు, పుల్లెద్దు ఏమయ్యాయో?

మాటలమధ్య నేను అమెరికా వెళ్లటం ఇప్పట్లో కుదరదని చెప్పాను. తాతయ్య నవ్వాడు. "పోనీలే. నువ్వెళ్లిపోతే నన్నెవురు జూత్తార్రా" అన్నాడు.

కాస్త గాలిసాగింది. కర్లపూడి రాకముందు మనస్సులో ఎంత ఆందోళన, అసంతృప్తి ఉన్నాయో అవన్నీ ఎటో గాలికి కొట్టుకెళ్లినట్టు అదృశ్యమైపోయాయి. పాతికేళ్లల్లో మొదటి ఐదారేళ్లు హాయిగా ఉన్నానేమో. చదువు మొదలైన దగ్గర్నుంచి ఎప్పుడూ ఆందోళన. ఎవరో తరుముతున్న భయం. రాంకులగురించి, సీట్ల గురించి, రాబోయే అవకాశాలగురించి ఎన్నెన్ని ఆందోళనలు! ఎప్పుడు ప్రశాంతంగా, భద్రంగా బతకగలిగాను? ఈ ఆందోళనకంతటికీ అర్థమేమిటి? నేనేం సాధించాలి? ఈ అభద్రతకి మూలమేమిటి? నా కళ్లల్లో నీళ్లు నిండాయి.

తాతయ్య నా ప్రశ్నలు వేటికీ జవాబు చెప్పలేదు. చెప్పగల జ్ఞానమూ తనకి లేదు. అయితే తను జీవితంలో ఎప్పుడూ దేనికీ ఆందోళన పడలేదు. దేనికీ అసంతృప్తి చెందలేదు. ఉన్నదానికీ లేనిదానికీ తపించలేదు. ఆయన కోల్పోయిందేమిటి? నేను పొందిందేమిటి? ఆయన జీవితంనుంచి నేను పొందాల్సిన సందేశమేదో ఉందని అర్థమైంది.

ఉన్నట్టుండి మంచంలో కదిలాడు తాత. 'అదుగో వానగాలి ముక్కులికి తగుల్తుంది. వానొస్తది. పైర్లు బతుకుతాయి' అన్నాడు. చుట్టూ చూశాను. సన్నగా వానగాలి.

కాసేపట్లోనే పెద్దవాన మొదలైంది. మట్టి తడిసిన వాసన. తాతయ్య మంచం పాకలోకి మార్చాం. తాతయ్య మొహంలో కొత్త జీవకళ తొణికిసలాడుతుంది. ఎక్కడో చిననాటి నా అనుభూతులు కదలబారుతూ... అశాంతి ఆవిరైపోతూ... ఎక్కడో ఏదో వానపాట.

'మోతదక కొండలమీనా ముసిరిందే వానమబ్బు
ముచ్చబోడు కొండలమీనా మొగిసిందే వానమబ్బు
అనంతారం కొండలమీనా ఆగిందే వానమబ్బు
నెక్కల్లు బోటిరాళ్లమీనా నెరిమిందే వానమబ్బు
కర్లపూడి కొండలమీనా కురిసిందే వానమబ్బు'

ఇప్పుడు వానలో నేను, నాలో వాన, సరికొత్త వాన.

●

## రచయితలకు సూచనలు!

- * మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
- * జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
- * మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
- * అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
- * మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
- * ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
- * రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
- * ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

మీ రచనలు పంపించవలసిన చిరునామా:

**ఆదివారం వార్త,**
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్- 500 080